సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 23 । ఆగస్టు । 2023



డ్రైవింగ్, ఆర్సీ కార్డులకు చెల్లు

డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ ఇంటి వద్ద మరచిపోయి వాహనంతో రోడ్డుపైకి వస్తే.. అధికారులు ఫైన్ వేస్తారు. ప్రస్తుతం అటువంటి కష్టాలకు చెక్ పడింది. - IIలో



మానవమృగానికి మరణదండన

మానవ మృగానికి మరణదండన పడింది. రెండు నిండుప్రాణాలను బలిగొన్న సయ్యద్ మౌలాలీ (47)కి కోర్టు మంగళవారం ఉరిశిక్ష విధించింది. - IIలో

గరిష్ఠం/కనిష్ఠం
35.7/26.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.5 - 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: డీ- ఫార్మసీ కోర్సుల ప్రవేశానికి ఆగస్టు 24వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://apsbtet.in/pharmacy నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితాలు, స్టడీ సర్టిఫికెట్స్ (6 నుంచి ఇంటర్ వరకు), టీసీ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలు ఆన్‌లైన్ నందు అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 94401 44057 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

'యూనివర్సిటీ'లో నారాయణమూర్తి



నారాయణమూర్తిని సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: సినీ ప్రముఖుడు ఆర్.నారాయణమూర్తి మంగళవారం కడప వచ్చారు. ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు, యువత ఆలోచనలు తదితర అంశాలపై తాను రూపొందించిన 'యూనివర్సిటీ' చిత్రం ప్రమోషన్ కోసం వైవీయూను సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డిలు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

డాక్టర్ల పోస్టులకు దరఖాస్తులు

కడప రూరల్: స్పెషలిస్ట్ డాక్టర్ల (పీడియాట్రిక్స్) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జాతీయ ఆరోగ్య పథకం కింద ఎస్ఎన్‌సీయు-కడప నందు ఏర్పడిన డాక్టర్ల పోస్టుల ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు నమూనా ఇతర వివరాలను కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

పశుసంవర్ధకశాఖలో పదోన్నతులు

కడప అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో పనిచేసే పలువురు అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి లభించింది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా ఉరవకొండలో ఏడీగా పనిచేస్తున్న రంగస్వామికి కడప వెటర్నరీ పాలిక్లీనిక్ డీడీగా పదోన్నతి లభించింది. అలాగే కడప డీఆర్‌డీఎల్‌లో ఏడీగా పనిచేస్తున్న మాలకొండయ్యకు రాయచోటి డీడీగా, మైదుకూరు ఏడీగా పనిచేస్తున్న రవికి చదలవాడ డీడీగా, ఎర్రగుంట్ల ఏడీగా పనిచేస్తున్న రమణయ్యకు ఆళ్లగడ్డ డీడీగా, తూర్పుగోదావరిలో ఏడీగా పనిచేసే విజయభాస్కర్‌రావుకు రాజంపేట డీడీగా పదోన్నతి లభించింది. వీరంతా రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పీఆర్ లింక్ రోడ్లకు నాబార్డు నిధులు

బి.కొత్తకోట: రాష్ట్రంలో మార్కెటింగ్‌శాఖ ద్వారా పంచాయతీరాజ్ లింక్‌రోడ్ల అభివృద్ధికి నాబార్డు రూ.1,600 కోట్లు మంజూరు చేసిందని ఆ శాఖ కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ సి.రామాంజనేయులు చెప్పారు. బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు ఆయన మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు కేటాయించిన నిధులతో మార్కెట్ కమిటీల పరిధిలో రైతులకు రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడం కోసం లింకురోడ్ల నిర్మాణ పనులు జరగనున్నట్లు చెప్పారు. కడప రీజినల్ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.123 కోట్ల మార్కెట్ సెస్సు వసూళ్ల లక్ష్యమని, ఇందులో ఇప్పటి వరకు రూ.38 కోట్లు వసూలైనట్టు చెప్పారు.

సాల్ట్‌తో నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం

కురబలకోట: సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) శిక్షణ ఉపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందని డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం పేర్కొన్నారు. ఆరు రోజుల పాటు జరిగే రెసిడెన్షియల్ సాల్ట్ శిక్షణ కార్యక్రమం అంగళ్లలోని గోల్డన్‌వ్యాలీ కళాశాలలో ప్రారంభమైంది. కడప, అన్నమయ్య, సత్యసాయి జిల్లాకు చెందిన యూపీ, ప్రాథమిక స్కూళ్ల హెడ్మాస్టర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సహకారంతో సాల్ట్ విజనరీ ప్రాజెక్టు ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకుని పాఠశాలలో అమలు చేయాలన్నారు. శిక్షణలో పట్టు సాధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

అవధి లేని ఉపాధి

- పనుల కల్పనలో రాష్ట్రంలో జిల్లాకు నాలుగో స్థానం
- ఈ ఏడాది మూడువేల ఎకరాల్లో ఉద్యాన పంటలు
- 563 పంచాయతీల్లో వలసల నివారణకు పథకం వర్తింపు
- అమృత సరోవర్ కింద 91 చెరువుల పునరుద్ధరణ



ఉపాధి పనులు చేస్తున్న వేతన జీవులు

కడప సిటీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాన్యుల పాలిట వరంలా మారింది. ప్రభుత్వం పనులు కల్పించడంతో బడుగు జీవులు ఉన్న ఊరిలోనే పనులు చేసుకుంటున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు ఉన్నప్పటికీ మిగతా సమయాల్లో కూలీలు వలస పోకుండా ఉపాధి పనులు నియంత్రిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వం వేతనాలను చెల్లిస్తుండడంతో కూలీలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

- జిల్లాలో మొత్తం 2,42,006 జాబ్ కార్డులు ఉండగా, ఇందులో యాక్టివ్ జాబ్ కార్డులు 1,98,347 ఉన్నాయి. ఇందులో 1,36,811 జాబ్ కార్డు కలిగిన కుటుంబాలకు పని కల్పించారు. ఈ ఏడాది 73 లక్షల పని దినాలు నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటికే 64.82 లక్షల పనిదినాలు నమోదయ్యాయి.
- నామ మాత్రపు పనులతో సరిపెట్టకుండా చెరువులను సమగ్రంగా అభివృద్ధి చేయడంతోపాటు కాల్వల్లో పూడికతీత, చెరువు గట్లను పటిష్టం చేయడం, నీటి కాల్వల భద్రత, చెరువు గట్లపై మొక్కల పెంపకం, చెక్‌డ్యాముల నిర్మాణం, చెత్త నుంచి సంపద వేరు చేసే కేంద్రాల నిర్మాణ పనులను చేపట్టడంతో ఆయా గ్రామాలకు ఆస్తులు సృష్టించబడుతున్నాయి.
- జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించి ఆర్థికంగా ఆదుకుంటూ రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్ జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది 88.79 శాతం ప్రగతిని సాధించింది. సుస్థిర మౌలిక వసతులు, సామాజిక ఉమ్మడి ఆస్తులు ఏర్పాటు చేయడంలో ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతోంది.

వంద శాతం వేతనం చెల్లింపు

ఉపాధి హామీ కూలీలకు వేతన చెల్లింపులో వంద శాతం ప్రగతి సాధించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే సమకూరుస్తోంది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, బీటీ, సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, సీసీ కాల్వల నిర్మాణం పనులతో గ్రామాల్లో కళ్లముందే శాశ్వత ఆస్తి కనిపిస్తోంది.

వేతనాల కింద శ్రమ జీవులకు రూ.156.88 కోట్లు చెల్లించారు. మెటీరియల్, పరిపాలనా ఖర్చులు కలిపి ఇప్పటి వరకు రూ.198.32 కోట్లు వెచ్చించారు.

3 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు

ఈ ఆర్థిక సంవత్సరం మూడు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అర్హులైన అన్నదాతల నుంచి దరఖాస్తులు స్వీకరించి పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో 563 గ్రామ పంచాయతీల్లో కొబ్బరి, మామిడి, సపోట, నిమ్మ, మునగ తోటలు, చీనీ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల సాగుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేయనుంది. మునగతోటలతో ఉపాధి లభించడమే కాకుండా ఉద్యానవన తోటల అభివృద్ధికి దోహదపడుతోంది. జిల్లాలో అమృత్ సరోవర్ కింద 91 చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టారు. అవసరమైతే కొత్త చెరువుల నిర్మాణాన్ని చేపట్టనున్నారు.



జిల్లాలో జారీ చేసిన జాబ్ కార్డులు: 242006	ఈ ఏడాది పని దినాల లక్ష్యం: 73 లక్షలు
యాక్టివ్‌లో ఉన్న జాబ్ కార్డులు: 198347	గ్రామ పంచాయతీలు: 563
పనులు కల్పించిన కుటుంబాలు: 1,36,811	ఉద్యాన పంటల సాగు: 3000 ఎకరాలు
ఇప్పటివరకు జరిగిన పని దినాలు: 64,81,935	అమృత్ సరోవర్ కింద పునరుద్ధరించిన చెరువులు: 91
ఇందుకుగాను వేతన ఖర్చు: రూ. 156.88 కోట్లు	ప్రగతి శాతం : 88.79
	వేతన చెల్లింపులు : 100 శాతం

వలసవెళ్లకుండా ఉపాధి



ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయకుంటే మాలాంటి వారికి ఎన్నో ఇబ్బందులు ఉండేవి. వ్యవసాయ పనులు లేకున్నప్పుడు ఉపాధి హామీ పనులు ఆదుకుంటున్నాయి. వలసలు వెళ్లకుండా ఉన్న గ్రామంలో పనులు చేసుకునేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోంది.

– సి.గంగులప్ప (జాబ్‌కార్డు నెంబరు 10320), కొత్తపల్లె, వేముల మండలం

శ్రమ జీవులను ఆదుకుంటున్నాం



ఉపాధి హామీ పథకం ప్రజల జీవనోపాధికి వరంగా మారింది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి హామీ పనులు కల్పించి శ్రమ జీవులను ఆదుకుంటున్నాం. జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉన్న గ్రామంలోనే పనులు కల్పిస్తున్నాం.

– యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

1న పులివెందులకు ముఖ్యమంత్రి

పర్యటనా ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

పులివెందుల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబరు 1న పులివెందులలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయరామరాజు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి కలిసి సీఎం పర్యటించే ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. భాకరాపురంలో సమీపంలోని హెలీప్యాడ్ సమీపంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణం, శిల్పారామంలో జరిగే అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఏపీ కార్ల్ సమీపంలో నిర్మించిన స్వామి నారాయణ్ గురుకుల విద్యా పీఠం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పురపాలక ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వర ప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, ఆర్డీఓ వెంకటేశులు, కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ విజయరామరాజు అధికారులతో మంగళవారం సమీక్షించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఒక్కొక్క శాఖ అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో పురోగతి సాధించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో నాడు-నేడు రెండో దశ కింద చేపట్టిన పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పేరెంట్స్ కమిటీ అకౌంట్లలో నిధులు పుష్కలంగా ఉన్నాయని, ఆ నిధులు వెచ్చించి పాఠశాలల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. మండల ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈఓలు ప్రతిరోజు ఐదు పాఠశాలలను పరిశీలించాలన్నారు. సీడీపీఓలు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పనులను పర్యవేక్షించి పూర్తి చేయించాలని చెప్పారు. నిధులున్న పాఠశాలల్లో ప్రతి వారం 20 శాతం ఖర్చు చూపాలన్నారు. పనుల్లో నాణ్యతా లోపాలుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2023-24 అకడమిక్ క్యాలెండర్‌ను ఎంఈఓలు ఖచ్చితంగా అనుసరించాలన్నారు. టెన్త్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరాల్సిన బాధ్యత ఎంఈఓలపై ఉందన్నారు. సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలను కూడా భాగస్వాములు చేయాలన్నారు.ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా

రాయచోటి: పీలేరు ప్రభుత్వ హైస్కూల్‌లో ఆవరణలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో మెగా జాబ్ మేళా పోస్టర్‌లను విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పీలేరు ఎమ్మెల్యే సి రామచంద్రారెడ్డి సంయుక్తంగా నిర్వహించే మెగాజాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ మెగాజాబ్ మేళాలో బహుళజాతీయ సంస్థకు చెందిన 20 కంపెనీలు పాల్గొంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. వివరాలకు 7093618420, 8897776368 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

- రాయచోటి జెడ్పీ భవనానికి 11 ఎకరాలు
- ఒంటిమిట్ట నీటి పథకానికి రూ.175 లక్షలతో ప్రతిపాదన
- జెడ్పీ ఛైర్మన్ ఆకెపాటి అమర్‌నాథరెడ్డి



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకెపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్ రోడ్స్: జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్ ఆకెపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. జెడ్పీలోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలోని లక్ష్మీ రంగ సర్కిల్ సమీపంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్వార్టర్స్, అతిథి భవనాలు, దుకాణసముదాయాల నిర్మాణం పూర్తయితే జెడ్పీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీ స్థాయిలో జెడ్పీ సమావేశ భవనం నిర్మించారని, ఆయన జ్ఞాపకార్థం సమీపంలో పార్కు అభివృద్ధి చేసి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీసీసీబీ హాల్‌కు పది సెంట్లు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం భవనానికి పది సెంట్లు, రాయచోటిలో జెడ్పీ భవనం నిర్మాణానికి 11 ఎకరాల స్థలం కేటాయిస్తున్నట్లు తెలిపారు. బాలరాజుపల్లె ప్రజలకు నీటి ఎద్దడి ఎదుర్కోకుండా ఇసుక తవ్వకాలు జరపాలని మైన్స్ అండ్ జియాలజీ అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్ట సీపీడబ్ల్యూ పథకం సోమశిల ముంపునకు గురవుతున్న దృష్ట్యా శాశ్వత కట్టడం కోసం రూ. 175 లక్షలు అవసరమవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తెలుపగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుదామని ఆకేపాటి తెలిపారు. పాఠశాలల్లో మినిస్టీరియల్ స్టాఫ్ తక్కువ ఉన్నచోట్ల డిప్యుటేషన్లపై సిబ్బందిని పంపాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో రాత్రి పూట స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని డీఎంహెచ్ఓకు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వివిధ అంశాలపై చర్చ

- గడప గడపకు కార్యక్రమం కింద జిల్లాలో 1900 పనులు మంజూరు కాగా, 600 పూర్తయ్యాయని, రూ. 18.50 కోట్లు చెల్లించామని, 1300 పనులు పురోగతిలో ఉన్నాయని సీపీఓ వెంకట్రావు వివరించారు.
- మురుగు కాల్వలు, రహదారుల పనులకు సంబంధించిన బిల్లులు త్వరగా మంజూరు చేయాలని బి.కోడూరు జెడ్పీటీసీ సభ్యుడు దావీద్ కోరారు.
- తమ మండలంలో రూ. 30 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణాన్ని డిసెంబరు 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించేలా చూడాలని వేంపల్లె జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి కోరారు. రాయచోటి-వేంపల్లె జాతీయ రహదారి పనులు జరగడం లేదని ఆరోపించారు.
- వద్దిరాల ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని మైలవరం జెడ్పీటీసీ సభ్యుడు కోరారు.
- తమ మండలంలో పంచాయతీ కార్యదర్శులు తక్కువగా ఉన్నారని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కాశినాయన జెడ్పీటీసీ సభ్యుడు కోరారు.

చదువుల రాణులు.. సరస్వతీ పుత్రికలు

తండ్రి కష్టాన్ని కళ్లారా చూశారు. తల్లి పడే తపనను దగ్గరుండి గమనించారు. చదువే ఆభరణమని గుర్తించి అహర్నిశలు శ్రమించారు. ఒకరిద్దరు కాదూ ముగ్గురూ విద్యావంతులయ్యారు. ఒకరు డీఎస్పీగా.. మరొకరు ఆర్డీవోగా ఉన్నత కొలువులు సాధించి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపారు. తల్లి పేరుకు తగ్గట్లే 'సరస్వతీ' పుత్రికలుగా ఖ్యాతి గడించారు. నందలూరు మండలం టంగుటూరుకు చెందిన సోదరీమణుల విజయగాథే ఈ రోజు ప్రత్యేక కథనం.

- అక్క డీఎస్పీ.. చెల్లెలు ఆర్డీఓ..
- మరోచెల్లెలు ప్రభుత్వ ఉద్యోగి



చదువులబిడ్డలతో తల్లి తండ్రి

రాజంపేట: నందలూరు మండలంలోని చెయ్యేటి పరీవాహక గ్రామమైన టంగుటూరు గ్రామంలో కం. భాలకుంట సుబ్బరాయుడు, కంభాలకుంట సరస్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తండ్రి సుబ్బరాయుడు ఆర్టీసీలో కండక్టరుగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. తల్లి సరస్వతి ఏడవ తరగతి వరకు చదువుకున్నారు. తమ ముగ్గురు బిడ్డలైన లావణ్య లక్ష్మీ, మాధవి, ప్రసన్నకుమారిని బాగా చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకున్నారు. ఆ దిశగా ముగ్గుర్ని చదివించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముగ్గురు కూడా కష్టపడి చదివారు. లావణ్యలక్ష్మీ, ప్రసన్నకుమారి ఏఐటీఎస్‌లో బీటెక్ విద్యను పూర్తి చేసిన అనంతరం సివిల్స్‌లో రాణించాలనే పట్టుదలతో పోటీపరీక్షలకు సిద్ధమయ్యారు. తొలి అడుగులో భాగంగా గ్రూప్స్‌లో విజేతలుగా నిలిచారు.

లావణ్యలక్ష్మీ.....



టంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన ఈమె పద్మావతి యూనివర్సిటీ పాలి టెక్నిక్ ఆపై ఏఐటీఎస్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2009లో గ్రూప్-1 విజేత గా నిలిచి మచిలీపట్నంలో డీఎస్పీగా తొలి పోస్టింగ్ చేపట్టారు. విజయవాడలో సెంట్రల్ ఏసీపీగా పనిచేశారు. మార్కాపురం ఓఎస్డీగా పనిచేశారు. 14 యేళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌లో ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా తిరుపతిలో చేస్తున్నారు. ఈమె భర్త డా.చంద్రశేఖర్ నెల్లూరు ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు.

మాధవి..



అక్క లావణ్యలక్ష్మీ బాటలోనే మాధవి కూడా గ్రూప్స్‌లో విజేతగా నిలవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. రాజంపేటలోని వైష్ణవీ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య పూర్తి చేసిన ఈమె ప్రస్తుతం ఏపీటిడ్కోలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఈమె భర్త కిరణకుమార్ కడపలో వ్యాపారిగా కొనసాగుతున్నారు.

అక్క చూపిన బాటలో..



అక్కను ఆదర్శంగా తీసుకున్న ప్రసన్నకుమారి గ్రూప్-1లో విజేతగా నిలిచింది. టంగుటూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన ఈమె , ఇంటర్ తిరుపతిలోని శ్రీ చైతన్యలో, ఆపై ఏఐటీఎస్‌లో బీటెక్ పూర్తి చేశారు. తొలుత టంగుటూరు గ్రామ సమీప ప్రాంతమైన టీవీపురానికి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ప్రసన్నకుమారి గ్రూప్-1కు ప్రిపేర్ అయ్యారు. ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్నారు. గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించారు. ఆర్డీఓగా నియమితులయ్యారు. సివిల్స్‌లో విజేత కావడమే తన లక్ష్యమంటున్నారు. ఈమె భర్త చంద్రాజీ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

నా కలలను బిడ్డలు నిజం చేశారు..



నేడు ఏడవ తరగతి వరకు చదువుకున్నాను. నా భర్త ఆర్టీసీలో కండక్టరుగా పనిచేశారు. బిడ్డలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నా కలను నా ముగ్గురు బిడ్డలు నిజం చేశారు. వారికి ఏనాడూ ఇంటిలో పనిచెప్పలేదు. చదువుకోవాలని పదేపదే చెబుతూవచ్చాను. కుమార్తెలను ఉన్నతంగా చూడాలనుకున్నారు. అదే జరిగింది. వారిని నిరంతరం చదువుకోవాలనే ప్రోత్సహించాం.

-తల్లి సరస్వతి

క్లుప్తంగా

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని మణప్పురం గోల్డ్‌లోన్ సంస్థలో ఈ నెల 19న చోరీకి ప్రయత్నించిన అంతర్ రాష్ట్ర దొంగ కర్ణం కుమార్ అలియాస్ గొల్లకుమార్ అలియాస్ అమర్‌రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో మంగళవారం అరెస్టు చేసి, కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం నారాయణనెల్లూరు గ్రామానికి చెందిన కుమార్‌పై తెలుగు రాష్ట్రాల్లో 50కు పైగా దొంగతనాల కేసులు నమోదై ఉన్నట్లు ఆయన తెలిపారు.

నాలుగున్నరేళ్లు ఎక్కడున్నావు?

– వరదరాజులరెడ్డిని ప్రశ్నించిన లింగారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ నేత మల్లేల లింగారెడ్డి

ప్రొద్దుటూరు : ఈ నాలుగున్నరేళ్లలో వరదరాజులరెడ్డి ఎక్కడున్నారని, టీడీపీ అధిష్టానం ప్రకటించకుండా ఆయనంతకు ఆయనే టికెట్ తనకే వస్తుందని ప్రకటించుకోవడం ఏమిటని ఆ పార్టీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీ టికెట్ మాకే వస్తుందని.. మేమే తప్పక పోటీ చేస్తామని' ఎవరికి వారు ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. 42 ఏళ్ల నుంచి రాజకీయాల్లో తాను ఉన్నానని, 37 ఏళ్లుగా టీడీపీలోనే వివిధ హోదాల్లో పని చేశానన్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నానన్నారు. కొన్ని రోజులుగా వరదరాజులరెడ్డి టీడీపీ నాయకుడని చెప్పుకుంటూ ఫారెస్ట్, సబ్ రిజిస్ట్రార్, పోలీసు శాఖలపై తన వ్యక్తిగత పనుల కోసం ప్రభుత్వ అధికారులను బెదిరించడం సమంజసం కాదన్నారు. ఇలాంటి చర్యలకు టీడీపీకి సంబంధం లేదన్నారు. ఇప్పటికైనా టికెట్ ఆశించే వారు అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీకి పని చేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు సాని విజయభాస్కర్ రెడ్డి, సిద్దయ్య, లాయర్ గుర్రప్ప, సుంకర వేణుగోపాల్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్, ఆర్సీ కార్డులకు చెల్లు

- ఏపీ ఆర్‌టీఏ యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసిన పత్రం చాలు
- అమలులోకి నూతన నిబంధన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) కార్డు పొరపాటున ఇంటి వద్ద మరచిపోయి సొంత కారు లేదా బైక్‌తో రోడ్డుపైకి వస్తే.. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఫైన్ వేయడం తర్వాత వాటిని చూపిస్తే, మాఫీ చేయడం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అటువంటి కష్టాలకు చెక్ పడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నింటా డిజిటలైజేషన్ అమలు చేస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. డ్రైవింగ్, ఆర్సీ కార్డు స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రం చూపిస్తే సరిపోతుంది. రవాణా శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్ అయ్యాయి. దీంతో చాలా రాష్ట్రాలలో కార్డు తొలగించి డిజిటల్ పత్రాలు తీసుకువచ్చారు. దీని అమలును ఈ నెల 8 నుంచి మన రాష్ట్రంలో కూడా ఆరంభించారు.



డ్రైవింగ్ లైసెన్స్

పెండింగ్‌లో ఉన్న కార్డుల జారీకి ఏర్పాట్లు

లైసెన్స్, ఆర్‌సీ జారీ కార్డుకు రూ.200, పోస్టల్ చార్జీలుగా రూ.25 తీసుకొని నేరుగా ఇంటికే పంపించారు. కార్డులు ప్రింట్ కాకపోవడం, పోస్టల్ ఆలస్యం వంటి కారణాలతో రెండు, మూడు నెలలు అయినా కార్డు చేతికి రాని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటి వరకు 56 వేల ఆర్‌సీ, డ్రైవింగ్ కార్డులకు ఫీజులు వసూలు చేశారు. దీంతో వాటి వరకూ ప్రింట్ చేసి వాహన చోదకులకు పంపించే ఏర్పాటు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ సమయంలో..

రవాణా శాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్‌టీఏ సిటిజన్.ఈప్రగతి.ఓఆర్‌టీ నుంచి ఫారం 6 లేదా 23 డౌన్‌లోడ్ చేసుకొని ధ్రువపత్రం తీసుకోవాలి. లేదా ఏపీఆర్‌టీఏ సిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసే సమయంలో పోలీసు లేదా రవాణా శాఖ అధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపిస్తే సరిపోతుంది. వీటిని అనుమతించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇకపై కార్డుల పంపిణీ ఉండదు

రవాణాశాఖ జారీ చేసే ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించి ఇకపై కార్డుల పంపిణీ ఉండదు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న కార్డులను ప్రింట్ చేసి వాహనాదారులకు అందజేస్తాం. డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు రవాణా శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.

– ఈ.మీరాప్రసాద్, ఉప రవాణా శాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా



వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల ప్రారంభం

ఖాజీపేట : మండల పరిధి రావులపల్లె, చెమ్ముళ్ళపల్లె గ్రామాల్లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ కేంద్రాలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి జ్యోతి వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. 2022 ఖరీఫ్‌లో పత్తి పంటకు నష్టపరిహారం విషయంలో ఇన్సూరెన్స్ చాలా మంది రైతులకు అందలేదని తుడుమలదిన్నె సర్పంచ్ కృష్ణారెడ్డి తెలిపారు. వెంటనే ఎంపీ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెమ్ముళ్ళపల్లెలో జెడ్పీఎస్ఎఫ్ ద్వారా ఇచ్చిన భూములు ఉన్నాయని, వాటికి పేర్లు మారక పోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఎంపీ నేరుగా కమిషనర్‌తో మాట్లాడారు. 1972లో వీరి భూములు ఇచ్చారని, పట్టా పొందని వారు చనిపోయారని, తిరిగి వారి వారసులకు పట్టాలు ఇవ్వాలని, ఇందులో జాప్యం చేయరాదని సూచించారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం అయితే సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. డ్వాక్రా మహిళల ఖాతాలో డబ్బు ఉన్నా.. బ్యాంకర్లు ఇవ్వడం లేదని పొదుపు సంఘాల సభ్యులు పేర్కొన్నారు. ఎంపీ వెంటనే పీడీ దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని సూచించారు. అలాగే పలు సమస్యలను ఆయన అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ప్రభుత్వ వ్యవసాయ, ఉద్యానవన సలహాదారులు ఇరగంరెడ్డి తిరిపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, నాయకుడు దవనం గంగాధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఎంపీ, ఎమ్మెల్యే వస్తే అధికారులు రారా?

చెమ్ముళ్ళపల్లె పంచాయతీలో అధికంగా రెవెన్యూ, వెలుగు సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకు వచ్చారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడేందుకు అక్కడ తహసీల్దార్‌తో పాటు వెలుగు అధికారులు ఎవరూ లేకపోవడంపై ఎంపీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమస్యలు తమ దృష్టికి తీసుకు వస్తే అధికారులతో మాట్లాడుదామనుకుంటే.. వారు ఎవరూ రాకపోతే ఎవరికి చెప్పాలంటూ ఉన్నతాధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే గ్రామ పర్యటనకు వస్తే అధికారులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

అమ్మో.. పులి.. మళ్లీ అలజడి

- మిడసాన్‌పల్లి సమీపంలోని పొలంలో పాదముద్రలు?
- తేల్చలేకపోతున్న ఫారెస్టు అధికారులు

ములకలచెరువు : ములకలచెరువు – పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులో మంగళవారం మళ్లీ చిరుత పులి సంచరించిందంటూ అలజడి రేగింది. మండలంలోని ఉంగరాళ్లపల్లెలో గత శనివారం రాత్రి ఒక పిల్లిని చిరుత పులి ఎత్తుకొని వెళ్లిందంటూ పలువురు కళ్లారా చూసినట్లు చెప్పిన మాటలు నిజమేనని తెలుస్తోంది. ఫారెస్టు అధికారులు మాత్రం అది అడవిపిల్లి అంటూ.. వారి మాటలను కొట్టిపారేస్తున్నారు. మూడు రోజుల తర్వాత ములకలచెరువు మండలం ఉంగరాళ్లపల్లెకి కిలోమీటరు సమీపంలోని పీటీయం మండలం మిడసాన్‌పల్లె వద్ద ఒక పొలంలో.. చిరుత పులి ఉందంటూ స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. బీటు అధికారులు సుధాకర్, గోపాల్ సంఘటన స్థలానికి చేరుకొని పొలంలోని పాదముద్రలు పరిశీలించారు. చిరుత పులి పాదముద్రల లాగే ఉన్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. పాదముద్రలు నిర్ధారణలో వారు తల పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు వస్తే తప్ప చిరుత పులినా లేక వేరే జంతువు పాదముద్రనా అనే విషయం తెలియదని వారు అంటున్నారు. పొలంలో సంచరించినది చిరుత పులి అని చూసిన వారు అంటున్నారు. నిజమో కాదో ఫారెస్టు అధికారులు తేల్చాల్సి వుంది.



పొలంలో పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

సంబేపల్లె : మండల కేంద్రంలో మంగళవారం ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నామాలగుట్టకు చెందిన కాకి వెంకటేష్(71) మంగళవారం సంబేపల్లెలోని వారపు సంతకు వెళ్లాడు. అక్కడ కూరగాయలు తీసుకొని ఇంటికి తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రోడ్డు దాటుతుండగా.. దేవపట్లకు వెళ్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

పట్టపగలు చోరీ

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన నక్కా వెంకటేశ్వర్లు తన భార్యను వైద్య పరీక్షల కోసం నెల్లూరుకు తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దుండగులు తాళం పగుల కొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాకు తాళాలు పెట్టి వదిలేసి ఉండటంతో.. అందులో ఉన్న 5 తులాల బంగారంతోపాటు రూ.50 వేల నగదును అపహరించారు. మధ్యాహ్నం తర్వాత నెల్లూరు నుంచి వచ్చిన వెంకటేశ్వర్లు గేటుకు వేసిన తాళం లేకపోవడంతో.. తలుపులు తెరిచి చూడగా పగులగొట్టిన తాళం లోపల పడి ఉంది. వెంటనే బీరువా వద్దకు వెళ్లి చూసుకోగా బంగారం, నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఇదే గ్రామ పంచాయతీలో చిన్నగోపవరంలోని ఆర్బీకే కేంద్రంలో ఈ ఏడాది మే 30న చోరీ జరిగింది. అందులో ఉన్న ఎల్ఈడీ టీవీ, ప్రింటర్‌ను ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు వ్యవసాయాధికారులు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదైంది. కానీ ఇప్పటి వరకు ఆ చోరీపై ఎలాంటి పురోగతి లేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో వస్తువులు చోరీకి గురైనా ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి ఆచూకీ గుర్తించకపోవడంతో దుండగులు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. అన్ని గ్రామ సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాలు, ఇతర కార్యాలయాలన్నీ కూడా గ్రామాల్లో చివరలో ఉండటంతో ఎప్పుడు ఎలాంటి సంఘటన జరుగుతుందోనని సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి చోరీలపై దృష్టి పెట్టి దుండగులను పట్టుకున్నట్లయితే.. ముందు ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండే అవకాశం ఉంది.

పెద్ద దర్గాలో ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రార్థనలు



కడప కల్చరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్ అమీర్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సంప్రదాయ వస్త్రధారణగా పేటాను అలంకరించి కండువా ధరింపజేశారు. ఎంపీ చాదర్ తలపై పెట్టుకుని దర్గాలోని ప్రధాన గురువులైన హజరత్ పీరుల్లా మాలిక్ మజార్ వద్దకు చేరుకున్నారు. చాదర్‌ను గురువుల మజార్‌పై సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్ల వద్ద ఫాతెహా చేశారు. దర్గా ప్రతినిధులు ఆయనకు ప్రసాదాన్ని అందజేశారు.

ఈతకెళ్లి యువకుడి మృతి

కలికిరి : ఈతకెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి కలికిరి పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వాల్మీకిపురం పట్టణం తరిగొండ రోడ్డు ఎన్టీఆర్ కాలనీకి చెందిన నాగరాజ కుమారుడు డి.జాన్సన్(38) కలికిరి పట్టణంలో ఓ దుకాణంలో వారం రోజులుగా పని చేస్తున్నాడు. సోమవారం తన స్నేహితులతో కలిసి క్రాస్ రోడ్డు సమీపంలో మద్యం సేవించాడు. అనంతరం క్రాస్ రోడ్డు సమీపంలోనే నాగలరాళ్ళబావిలోకి ఈతకెళ్లాడు. ఈత ఆడుతూ మునిగి పోయాడు. స్నేహితులు పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే రాత్రి అయిపోవడంతో గాలింపు చర్యలు చేపట్టడం సాధ్యం కాలేదు. మంగళవారం ఉదయం పీలేరు అగ్నిమాపక కార్యాలయ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు బావిలో గాలింపు చేపట్టగా జాన్సన్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



జాన్సన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు మండల పరిధిలోని కుమారునిపల్లె క్రాస్ వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో పుత్త చిన్నాయపల్లెకు చెందిన పుత్తా గంగిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన పుత్త చిన్నాయపల్లె నుంచి ద్విచక్రవాహనంలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో కడప ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

మహిళపై దాడి


పీలేరు రూరల్ : మండలంలోని జాండ్లపల్లె పంచాయతీ పచ్చారుమాకులపల్లె తండాకు చెందిన ఎం.కళావతి (35)ని మంగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన బుక్కే అనిల్‌నాయక్, కృష్ణమూర్తి నాయక్‌లు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జూదరుల అరెస్ట్

కలసపాడు : మండలంలోని ముసల్‌రెడ్డిపల్లె వద్ద కంప చెట్లలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగమురళి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,150లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు జగదీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగానికి మరణదండన

- హంతకుడు సయ్యద్‌మౌలాలికి చిత్తూరు కోర్టు తీర్పు
- 2020లో వేర్వేరుగా తల్లీకూతుళ్ల దారుణ హత్య
- కూతురు సరళమ్మ హత్యకు రెండు జీవిత ఖైదులు
- తల్లి గంగులమ్మ హత్యకు జీవితఖైదు, ఉరి శిక్ష
- నిండుప్రాణాలను బలిగొన్న అనుమానం
- ప్రత్యేక శ్రద్ధతో కేసులు ఛేదించిన పోలీసులు



మానవ మృగానికి మరణదండన పడింది. మానవత్వం మరచి కిరాతకంగా వ్యవహరించిన అతను తగిన మూల్యం చెల్లించుకున్నాడు. రెండు నిండుప్రాణాలను బలిగొనడంతో.. న్యాయమూర్తి ఉరిశిక్షతోపాటు మూడు జీవిత ఖైదులు, జరిమానా విధించారు. ఒకహత్య పశ్చాత్తాపం కలిగించకపోగా, మరో హత్య చేశాడు. ఈ కేసును విచారణ చేసిన న్యాయస్థానం ఈ రెండు హత్య కేసుల్లో తీర్పును వెలువరించింది. వివాహేతర బంధం కొనసాగిస్తోందని ఓ మహిళపై తలెత్తిన అనుమానం హత్యలకు దారితీసింది. కేసులను ఛేదించేందుకు పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. చివరకు బాధిత కుటుంబానికి న్యాయం జరిగింది.

బి.కొత్తకోట : ఇద్దరిని హత్య చేసిన సయ్యద్ మౌలాలీ (47)కి చిత్తూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్.రమేష్ మంగళవారం ఉరిశిక్షతోపాటు మూడు జీవిత ఖైదులు, జరిమానా విధించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం గోవిందువారిపల్లెకు చెందిన గంగులమ్మ(65) కుమార్తె సరళమ్మ(35). ఈమెకు ముగ్గురు కుమార్తెలు కాగా భర్త 8 ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి గంగులమ్మతో కలిసి ఇంటిలో ఉంటోంది. తమ కుటుంబానికి చెందిన భూమికి సంబంధించి సమస్య ఉండటంతో సరళమ్మ తరచూ తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిపోతుండేది. ఈ నేపథ్యంలో తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన సయ్యద్‌మౌలాలి (47)తో సరళమ్మకు వివాహేతర బంధం ఏర్పడింది. ఈ విషయం అందరికీ తెలియడంతో ఏటిగడ్డతండా సమీపంలో కాపురం పెట్టుకున్నారు. నాలుగేళ్లుగా గ్రామానికి సమీపంలో రేకులషెడ్డును నిర్మించుకుని కాపురం ఉంటున్నారు. కాగా సరళమ్మ ఫోన్‌లో ఎవరో వ్యక్తితో మాట్లాడుతోందని అనుమానించి, ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పాడు. అయినా ఆమె పట్టించుకోలేదు. సరళమ్మపై మరింత అనుమానం పెంచుకున్నాడు. 2020 సెప్టెంబర్ 29న వేరుశనగ పొలంలోకి పందులు రాకుండా సరళమ్మ, మౌలాలి కాపలా కాస్తూ మంచంపై పడుకున్నారు. ఈ సందర్భంగా వేరే వక్తులతో ఎందుకు మాట్లాడుతున్నావని సరళమ్మను మౌలాలి ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో మౌలాలి కట్టెతో సరళమ్మ ఎడమ పక్క కణితిపై కొట్టడంతో కింద పడిపోయింది. చనిపోయిందని నిర్ధారించుకుని మృతదేహాన్ని సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టులోకి ట్యూబ్‌పై తీసుకెళ్లి తేలకుండా బండరాళ్లను కట్టి నీటిలోకి పడేశాడు. మరుసటిరోజు ఉదయం కుమార్తె సరళమ్మ ఎక్కడని తల్లి గంగులమ్మ ప్రశ్నించగా అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లిందని మౌలాలీ నమ్మించే ప్రయత్నం చేశాడు. 2020 అక్టోబర్ 1న సరళమ్మ ఎక్కడుందని గంగులమ్మ గట్టిగా నిలదీసింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో అదే రోజు రాత్రి ఆమెకు మద్యం తాగించాడు. తర్వాత ఇంటి బయట నిద్రిస్తున్న గంగులమ్మను అర్ధరాత్రి దాటాక ఆమె చీర కొంగుతో గొంతు నులిమి చంపేశాడు. చనిపోయిన గంగులమ్మ మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి గంగచెరువు నీటిలో చెట్టు మొదలుకు చీరను కట్టి నీటిలో పడేశాడు. మరుసటి రోజు తల్లి, అవ్వ కనిపించకపోవడంతో మౌలాలిని సరళమ్మ కుమార్తెలు ప్రశ్నించగా కరోనా సోకి ఆస్పత్రికి వెళ్లారని నమ్మించాడు. అంతటితో ఆగక ముగ్గురు పిల్లలను కర్ణాటకలోని గొనిపల్లెకు తీసుకెళ్లి అక్కడ అద్దె ఇంటిలో ఉంచి చంపేస్తానని బెదిరించాడు. ఈ హత్యలు జరిగిన తర్వాత పీలేరులోని ఏటిగడ్డ గ్రామానికి చెందిన బంధువులు గోవిందువారిపల్లెకు వచ్చి గంగులమ్మ గురించి ఆరా తీయగా కనిపించలేదు. దీనితో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి తంబళ్లపల్లె ఎస్ఐ సహదేవి అదృశ్యం కేసు నమోదు చేయగా.. విచారణలో హత్యలుగా వెలుగుచూడటంతో సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేసి నిందితున్ని అరెస్ట్ చేశారు.



సరళమ్మ (ఫైల్)



గంగులమ్మ (ఫైల్)



హంతకుడు మౌలాలి (ఫైల్)

ఒక ఉరి, 3 జీవిత ఖైదులు

రెండు హత్యలపై తంబళ్లపల్లె పోలీసులు అప్పట్లో కేసులు నమోదు చేయగా, అప్పటి ములకలచెరువు సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేయగా, అప్పటి డీఎస్పీ రవిమనోహరాచారి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. హతులు ఎస్సీలు కావడంతో హత్య, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో చిత్తూరు ఫస్ట్ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి ఎస్.రమేష్ నిందితుడు సయ్యద్‌మౌలాలీకి శిక్షలు ఖరారు చేస్తూ తీర్పు చెప్పారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.లోకనాథరెడ్డి తెలిపారు. మొదట జరిగిన సరళమ్మ హత్య కేసులో జీవితఖైదు, ఇదే కేసులో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో మరో జీవితఖైదు విధించారు. సరళమ్మను హత్య చేసిన పశ్చాత్తాపం లేకపోగా ఆమె తల్లి గంగులమ్మను కూడా హత్య చేయడంతో ఈ కేసులో నిందితుడు మౌలాలికి మరణశిక్ష విధించారు. ఐపీసీ సెక్షన్ 201 కేసులో ఏడేళ్ల జీవిత ఖైదు విధించారు. కేసుల్లో ఐదు జరిమానాల కింద రూ.5 వేలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

తల్లి, కుమార్తెను హతమార్చిన సయ్యద్ మౌలాలి ఓ బాలిక(15)పైనా అత్యాచారం చేశాడు. సరళమ్మ ముగ్గురు కుమార్తెల్లో ఒక బాలికపై అత్యాచారం చేశాడు. పిల్లలను కర్ణాటకలో ఉంచినప్పుడు ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనిపైనా కేసు నమోదు చేసి విచారణ చేసిన డీఎస్పీ రవిమనోహరాచారి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై చిత్తూరు స్పెషల్ ఫోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి ఈ ఏడాది మార్చి 13న శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. నిందితుడు మౌలాలి చనిపోయేంత వరకు జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ..బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

తెప్పలపై కష్టాలు.. డీఎన్ఏ పరీక్షలు

సరళమ్మ మృతదేహాన్ని బండరాళ్లతో కట్టి పెద్దేరు ప్రాజెక్టులో వేయడంతో వెలికి తీసేందుకు పోలీసులకు రెండు రోజులు పట్టింది. ప్రాజెక్టులో నిండుగా నీళ్లు ఉండటంతో మృతదేహం ఎక్కడుందో కనిపెట్టేందుకు వ్యవసాయ బోర్లకు వినియోగించే కెమెరాలను ఉపయోగించారు. తెప్పలపై వెళ్లి కెమెరాలను నీళ్లలోకి పంపి శోధించారు. అప్పటికే చేపలు తినేసిన మృతదేహాన్ని వెలికితీశారు. గంగచెరువులోని గంగులమ్మ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసినా గుర్తు పట్టలేని విధంగా ఉండటంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతులను గుర్తించారు. తర్వాత నిందితుడు మౌలాలి నివసించిన కర్ణాటకలోని గొనిపల్లెలో దర్యాప్తు చేశారు. జంట హత్యలు, బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారించి ఆధారాలు సేకరించడంతో మౌలాలిపై చార్జీషీట్ దాఖలు చేశారు.

• సృజన

హ్యాపీ స్పేస్



• భార్గవి

యాంత్రిక ప్రయాణంలో
పోటీ ఎప్పుడూ ఉండేదే!
కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు
అమ్మ కళ్లలో.. కలల్లో
చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది.
'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే
నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి.
హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి
నేచురల్ కలర్స్ వాడకం గురించి
అపార్ట్‌మెంట్ పిల్లలకు
పరిచయం చేస్తూ కనిపించారు.
ఆసక్తితో ఆమె చేస్తున్న
పని గురించి ప్రశ్నించినప్పుడు
పిల్లల కోసం తను సృష్టించిన
సహజ ప్రపంచాన్ని
మన ముందుంచారు..



• ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...

• నిశితంగా తెలుసుకుంటూ...

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, పైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్‌తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రెన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి
ఫొటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత 'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడిగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం



• మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్లలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్ల ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లలోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వీ మేళా, అక్షయ్‌కల్ప రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

యూత్ ప్లస్

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు



సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారీ పోటర్' సిరీస్‌లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్ట్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రెటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్ బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్– జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

